జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి రు. 116 పొందిన కథ.

జీవన స్పర్శ

వి. రాజారామమోహనరావు

వినపడే చప్పుళ్ళే వాడికి ప్రపంచం. స్పర్శే వాడికి జీవితం. భూమిని అడుగుల్తోటి, పరిసరాల్ని ఊహలతోటి కొలుస్తూ వొచ్చి కూచున్నాడు.

ఆడది కాబట్టి బాగా జనం తిరిగే రోడ్డవటం వల్ల పొద్దెక్కే వరకు పడుకునుండటం బావుండదు కాబట్టి సావిత్రి అప్పటికే నిద్ర లేచి అరుగుచివర కూచుంది. నిద్రలేవగానే పక్కనే వున్న హోటల్కెళ్ళి టీ తాగింది. తాగేసి, యింకేం చెయ్యటానికీ చేతిలో డబ్బుల్లేక తిరిగి అరుగు దగ్గర కొచ్చి దిక్కులు చూస్తూ కూచుంది. సరిగ్గా అప్పుడే సావిత్రి కళ్ళల్లో పడ్డాడు వాడు.

చేతికర్రతో నేలని తాటిస్తూ గాలిలో వెతుకుతూ చిన్న కుర్రాడిలా అడుగు వేసుకుంటూ వస్తున్న వాణ్ణి చిత్రంగా చూసింది సావిత్రి. కర్ర సాయంతో నడిచే ఎందరో గుడ్డాళ్ళని అంతకు ముందు చూసింది సావిత్రి. కానీ వీడంత నెమ్మదిగా అడుగులో అడుగు వేస్తున్నట్టు నడిచే వాళ్ళని చూళ్ళేదు.

ఒకవేపు హోటల్, మరోవేపు గుడికి వెళ్ళే సందు, యిందుమించు యీ రెండింటిమధ్య వుంది వాడు కూచున్న చోటు. సర్దుకు కూచున్నాక, తన ముందు వో తువ్వాలు పరిచి అడుక్కునే కార్యక్రమం మొదలెట్టాడు. ధర్మం చెయ్యమని రకరకాలుగా వాడు అంటున్న మాటలు సావిత్రికీ వినిపిస్తున్నాయి.

మరీ అంత రంగు లేకపోయినా నలుపుకాదు .. యిరవై దరిదాపులో వయసు....ఆరోగ్యంగా కుదురుగా వున్న వాడివేపు ఓ పావుగంట అలాగే చూసింది సావిత్రి.

ఊరు కొత్త, ఎటువెళ్ళాలో ఏం చెయ్యాలో తోచని అయోమయం, బద్ధకంగా వున్న వొళ్లు....అందుకే అలా తీరుబడిగా వాణ్ణి చూస్తూ కూచుంది. మరో గంట గడిచేటప్పటికి దరిదాపు పది పదిహేనుమంది వాడికి ధర్మం చేయటం చూసింది. సావిత్రి. 'ఐదు పైసలు, పదిపైసలు వేసినా యించు

మించు రూపాయి....గంట గడవకుండా రూపాయి సంపాదన'.... అనుకుంది సావిత్రి. అలా అనుకోగానే సావిత్రి గుండెలదిరాయి.

వాడి ముందు నుంచి యిటూ, అటూ తిరుగుతున్న జనానికి లోటేం లేకుండా వుంది. సాధారణంగా అందరు అడుక్కునే వాళ్ళలా, మాసిన గుడ్డల్లోటి, మట్టి వొంటితో కాకుండా శుభ్రంగా వుతికిన బట్టలు, నీటుగా చక్కగా వున్న వాడి తీరూ. ....చదువు, సంధ్యా లేనోణ్ని, కాయ కష్టం చెయ్యలేనోణ్ని, రెండు కళ్లూ లేని కబోధిని..అని వాడు మెత్తగా, దీనంగా అడుక్కునే పద్ధతీ సావిత్రి కళ్ళ బడ్డాయి.

"అమ్మో-కళ్ల లేకపోయినా....దిట్టమైనోడే....మంచి సెంటరు ....దానికి తోడు మంచి లయగా అడుక్కుంటున్నాడు" అనుకుంది సావిత్రి. అలా అనుకున్న మరుక్షణం దాని ఆలోచన వేగం పెరిగింది. గడిచిన, గడుస్తున్న జీవితపు నికృష్టపు అనుభవాలు, జ్ఞాపకాలు మనసులో మెదిలాయి. వీటన్నింటికన్నా కడుపులో కరకర మంటున్న ఆకలి వొక్కసారిగా వొళ్లు విరుచుకున్నట్టయింది. కూచున్న చోట్నుంచి లేచి వాడి వేపు నడిచింది.

తన పక్కకి వచ్చి ఆగాక సావిత్రి అడుగుల చప్పుడు గుర్తించాడు వాడు. వో క్షణం చెవులు రిక్కించుకుని చూశాడు. అడుగు అటుగానీ, ఇటుగానీ పడిన సవ్వడి వినిపించలేదు. అనుమానంగా ముందు డబ్బులున్న తువ్వాలు మీద గాలిలో చేతులు అటూ, ఇటూ వూపి వెదికాడు. అది చూసి కిస్సుకున నవ్వింది సావిత్రి. నవ్వి.... "నువ్వడుక్కున ఆ డబ్బులేం ఎత్తుకుపోన్లే.." అంది వాడి పక్కనే కూచుంటూ. ఆ తర్వాత ఇద్దరికీ మాటకలవటానికీ,

రచయిత పరిచయం

రచయిత ఆంధ్ర పాఠకులకు చిర పరిచితులు. ఆయన అనేక కథలూ, వ్యాసాలూ రాశారు. 'వరద' వంటి కథలమొదలు ధారాప్రవాహంగా వివిధ పత్రికలలో ప్రచురితమవుతున్నాయి. కథల పోటీల్లో ఎన్నోసార్లు బహుమతు లందుకొన్నారు.

నివాసం : హైదరాబాదు.

రైల్వేలో ఉద్యోగం.

లిటరేచ రన్నా, మ్యూజిక్ అన్నా ఎంతో అభిమానం అంటారాయన.

కబుర్లు చెప్పుకోటానికి ఎంతో సేపు పట్టలేదు. ఆ తర్వాత వాడి పక్క నుంచి కదల్లేదు సావిత్రి. వాడితోటి కలిసే టిఫిన్ తింది, టీ తాగింది.... భోం చేసింది. సాయంత్రం చీకటిపడే పల వాడికెన్నో కబుర్లు చెప్పింది. వాడి చేత ఎన్నో కబుర్లు చెప్పించుకుంది. తన ఒంటరితనం, తన వయసు వాడికి కనిపించేలా ఎన్నోసార్లు నవ్వింది.

సాయంత్రంలోప సావిత్రి వాడ్ని ఎన్నో విషయాలడిగింది. "నువ్వు పుట్టిగుడ్డాడివా?" అంది. "మొదట్నించీ ఈ వూళ్ళోనే వుంటున్నావా?" అంది. "నాలాగే నీకూ ఎవరూ లేరు కదూ" అంది. అలా అంటునే మధ్య మధ్యలో తన గురించి కూడా సావిత్రి కొన్ని విషయాలు చెప్పింది వాడికి.... ఒంటరి ఆడదా"న్నంది-నీలాగే నాదీ ఒడుక్కునే బతుకంది. "మగాళ్ళని నమ్మకూడ" దంది. వెంటనే "మంచి మగాళ్ళని

స ్మలి ఉంది ... వయసు పెద్ద
ంపి. అందులో తనలాంటి ఆడ
కున్నే ఆడది వయసులో వుండటంలో
చాలా కష్టం వుందంది .... యిలా
వైముత్తానికి వాడికి చెప్పాల్సిందంతా
చెప్పి, వాడిచేత చెప్పించుకోవాల్సిందం
తా చెప్పించుకుంది. ఆఖరికి రాత్రివాడు
అక్కణ్నుంచి లేచి వెళ్ళేటప్పుడుతన చే
యి అందించి ముందుకు నడిపించింది.
చీకటి బ్రతుకిచ్చే చిరుదివ్వెలా అందిన
సావిత్రి మెత్తటి చేతిని నిమురుతూ
వాడూ మనస్ఫూర్తిగా.... "ఈరాత్రికి
ఒక్కదానివి ఎక్కడ పెడతావు ....నాతో
పాటే వచ్చెయి....." అన్నాడు. సావిత్రి
నవ్వుతుంది. పైకి నవ్వింది, నవ్వి
చేతిని మరింత గట్టిగా పట్టుకుంది.

o o o

హోటల్లో కెళ్ళి రొట్టెలు, మాంసం
కూరా కొనుక్కుని అక్కడికి చేరారు
అక్కడికి చేరాక పరికించి చూటూ

చూసింది సావిత్రి. పాడడిపోయిన యింటివసారా అది. అసలే ఆ యిల్లున్న సందు చిన్నది. దానికితోడు సందుకి ఆఖరి యిల్లది. అంతా చూసి అనుకూలంగానే వుందనుకుంది. చాలారోజుల తర్వాత కక్కుర్తి లేకుండా కడుపునిండా రొట్టెలు, వాటికి తోడు రుచిగా కూర తింది. సావిత్రి తిన్న కొద్దీ పెట్టాడు వాడు.

అనుభవం అదే అయినా అనుభూతి వేరుగావుంది అంతకు ముందు ఆడవాళ్ళతో కొన్ని కిరాయి అనుభవాలున్నా వాడికి సావిత్రితో ఈ అనుభవం కొత్తగావుంది. తనచోట్లో, తనది అనిపించిన రాత్రిలో ఏ కిరాయి బేరాలు లేకుండా ఏ తొందరా లేకుండా గడుస్తున్న సమయం గొప్పగా అనిపించింది. వొదులుకోలేని పెన్నిధిలా దూరం చేసుకోకూడదని నిధిలా ఆ రాత్రతా సావిత్రి వొంటిని అంటి పెట్టుకునే గడిపాడు. తనకి బుద్ధి తెలిసిం తర్వాత అంతటి గొప్ప స్పర్శని, సుఖాన్ని ఎప్పుడూ పొందలేదనిపించింది వాడికి.

రోజులు గడుస్తున్నాయి. వారం, పది రోజులు, పదిహేను రోజులు గడిచాయి. ఏర్పడ్డ సంబంధం, వాడికీ, సావిత్రికీ యిద్దరికీ సుఖంగానే వుంది.

ఆకలి బాధలేదు . తిండి వెతుకులాట తప్పింది. చేతులు చాచి వొళ్ళప్పగించి రోజు గడుపుకునే నరకం తప్పింది.... అది సావిత్రి సుఖం.

చీకటిగా .. చీకటిలో వొంటరిగా.... కేవలం అడుక్కుని, తిండితిని రోజు గడిపే యంత్రంలా బతికేవాడికి తోడు. తన పిలుపుకి, ఆశలకి బదులు పలికే మనిషితోడు దొరకటం ఏదో వెలుగు ప్రపంచం దొరికినట్టయింది .... ఇరవై ఏళ్ళవాడి వయసుకి జీవితం దొరికినట్టుంది. అదీ వాడి సుఖం.

ఆ సుఖం యిద్దరికీ తృప్తిగానే వున్నా, రోజులు బాగానే గడుస్తున్నా యిద్దరూ అంతటితో ఆగలేదు. వాడికి కొత్త కోరికలు, కొత్త ఊహలు పుట్టుకొచ్చాయి. అలాగే సావిత్రికి కొత్త బుద్ధులు పుట్టుకొచ్చాయి. దానికి కారణం....

o o o

అప్పుడే నిద్దర్లోకి జారుకున్న సావిత్రి పక్కన పడుకున్న వాడు 'అలా చేస్తే ఎలా వుంటుంది'... అనుకున్నాడు. బాగానే వుంటుందనిపించింది. మనసులోనే గుణించుకుని వోసారి లెక్కవేసుకున్నాడు .. దాచుకున్న సొమ్ము దరిదాపు వెయ్యి రూపాయలు....దానితో ఏదో ఒకటి చెయ్యొచ్చు. సావిత్రికి కళ్లున్నాయి... తనలాగ గుడ్డిది కాదు . తెలివుంది.... ఏ చిన్న యాపారం చేసుకున్నా యిద్దరి పొట్టలు గడిచిపోతాయి. యిలా పొద్దున్నించి రాత్రిదాకా అడుక్కునే ఎదవ బతుకు మానేయచ్చు ' అనుకున్నాడు తనలో తానే.

"ఏంటీ దరిద్రబ్బతుకు అందరి దయాధర్మాలమీద పొట్టపోసుకుంటూ యిలా ఎన్నాళ్ళు బతికినా ఏంటిలాబం" అన్న బాధ వాడిలో ఎప్పణ్ణించో వుంది. అయినా మరో దారేం లేని తన గుడ్డి తనాన్ని జ్ఞాపకం చేసుకుని తనకి తనే

నచ్చచెప్పుకునేవాడు. వాడికి జ్ఞానం తెలిసిం దగ్గర్నుంచీ అడుక్కుంటూనే వున్నాడు. రకరకాల స్థలాల్లో, అనేక రకాలమంది మధ్య బతికాడు. రోజులో మూడొంతులు పైగా అడుక్కునే బతుకుల ఆరాటం వాడికి తెలుసు ...తిండి ... ఆకలిమంట ఆర్పుకోగలిగే నాలుగు డబ్బులు .. పెద్దాచిన్నా లేదు....ఆడామగా లేదు . ఎవడి తాపత్రయం వాడికి ముఖ్యం. పసితనంలో పెద్ద ముష్టాళ్ళు తనని కొట్టి అడుక్కున్న నాలుగు డబ్బులు లాక్కుపోటం ఎన్నోసార్లు వాడి అనుభవంలో వుంది. బతకటమే తప్ప, ఎవరికి ఎవరూ ఏం కాని ఆ జీవితం, వాళ్ళ గొడవలు, దెబ్బలాటలు చిన్నతనంలోనే వాడి మనసుని విరిచేశాయి ఆకలి, అసహాయత కలిసి వాడిలో తరచుగా రేపే ప్రశ్న .. "నాకు ఎవరూ లేరా....యింక నా బతుకింతేనా?" అని జ్ఞాపకాల ఆధారంతో వాడెన్నోసార్లు వెనక్కి, వెనక్కి వెళ్ళి ఎంతగానో ప్రయత్నించాడు ఎవరేనా నా అన్నవాళ్లు గుర్తొస్తారేమోనని ఆరేడేళ్ళ వయసులో మాత్రం తనని కూడా కూడా తిప్పుకునే తాత గుర్తొచ్చేవాడు. "నేను నీ తాతనిరా" అని ఆ ముసలి గొంతు పలికే మాటతప్ప వాడికి యింకే గుర్తు లేదు. ఆ చేరువా ఎన్నాళ్ళో మిగలలేదు. వాడికి చావంటే ఏమిటో యింకా సరిగ్గా తెలియని వయసులోనే ఆ ముసలాడు చచ్చిపోయాడు.

"ఆ ముసలాడు. ..వుట్టి దొంగరా . నిన్ను మీ అమ్మా నాన్నదగ్గర్నించి ఎత్తుకొచ్చాడురా" అనేవాళ్లు కొంత

మంచి "నువ్వు పుట్టుగుడ్డాడివి కాదురా, ఎవరో కావాలనే నిన్ను గుడ్డాణ్ణి చేశారు....సంపాదనకోసం .." అనే వారు ఇలాంటి మాటలన్నీ వాణ్ణి కల్లోలపరచటానికి తప్ప మరెందుకూ పనికి రాలేదు. కాలం మొండితనాన్ని అలవాటు చేసింది. సాధ్యమైనంతవరకూ నా వాళ్ళు, నాది అన్న ఆలోచనలకి దూరంగా బతకటం అలవాటు చేసుకున్నాడు. "అప్పుడు అవకాశం లేదు.. మరో దారేం లేదు. కానీ యిప్పుడు యిప్పుడు సావిత్రుంది....తనదగ్గర కూడబెట్టిన డబ్బుంది ...అలా ఆలోచిస్తూ ఆ రాత్రి చాలాసేపు గడిపాడు. చాలాసేపు రెప్పవెయ్యకుండా ఎన్నెన్నో తీపి కలల్ని ఊహించుకున్నాడు.

"చిన్న కూరగాయల కొట్టో, రోడ్డు మీద మరో రకం వ్యాపారమో.. సావిత్రి చూసుకుంటుంది. చిన్న గుడిసెలో కాపరం పెట్టుకోవచ్చు. కొన్నాళ్ళకి ఒకళ్లో, యిద్దరో పిల్లలు...." వొళ్లు జలదరించింది. వాడికి ఉత్సాహంతో అప్పటికప్పుడే సావిత్రిని నిద్రలేపేయాలనిపించింది.

మర్నాడు కూడా ఆలోచించి నిర్ణయించుకున్నాక ఆ రాత్రి సావిత్రికి చెప్పేయాలనుకున్నాడు. తిండి తిని పడుకుని దగ్గరగా వున్నప్పుడు నెమ్మదిగా విషయం అంతా చెప్పాడు. సావిత్రి వుబ్బితబ్బిబ్బయింది. ఆశ్చర్యంతో సంతోషంతో వుక్కిరిబిక్కిరైంది. వాణ్ణి వుక్కిరిబిక్కిరిచేసింది. ఆ రాత్రిని అపూర్వ రాత్రిలా మార్చింది వాడికి సావిత్రి. ఇద్దరూ వొకరిలోకి ఒకరు చొచ్చుకుపోయేలా ఆవేశపడ్డారు.

సావిత్రి నుంచి వచ్చే ఉచ్ఛ్వాసనిశ్వాసలు ఎంతో వేగంగా వీచేగాలి కి తప్ప అంత శబ్దం దేనికి వుండదనిపించింది వాడికి—అందుకే సావిత్రిని అదే అడిగాడు "గాలి తుఫాన్లా ఆ చప్పుడేంటే" అని.

"ఏం లేదులే అంది సిగ్గుగా సావిత్రి. కళ్ళు లేవు కాబట్టి సావిత్రి సిగ్గుని చూళ్ళేకపోయాడు. సావిత్రి సిగ్గుని మురిపెంగా విన్నాడు వాడు. ఆ రాత్రి యిద్దరికీ వొళ్ళెరక్కుండానే గడిచింది. ఏం వ్యాపారం చెయ్యాలో సావిత్రినే ఆలోచించమన్నాడు వాడు.

ఆ మర్నాడు వొంటరిగా కూచున్న సావిత్రికి చిత్రమైన ఆలోచనొచ్చింది. ఆ వూహకి వులిక్కిపడింది. "ఛీ... ఛీ..." అనుకుంది. అయినా ఆ వూహ సావిత్రినొదల్లేదు. నిమిషాల మీద ఎదిగి సావిత్రిని చుట్టుముట్టింది. కంగారు, కంగారుగానే అక్కడి వాడి బట్టలు, సామాను అంతా వెతికింది. డబ్బున్న చిన్న మూట లాంటిదిగానీ, డబ్బాగానీ కనపడుతుందేమోనని-మళ్ళీ వెతికింది. ఎంత వెదికినా సావిత్రికేం దొరకలేదు. ఆశ... ఆరాటం.... బాధ .... అటో ఇటో తేల్చుకోలేని అస్థిమితం.

కాలుకాలిన పిల్లిలా ఆవసారా అంతా తిరిగింది. అలా తిరుగుతుంటే సావిత్రికి పాత జీవితం కళ్ళ ముందు కదిలింది. రూపాయి డబ్బులు కోసం ఇది వరకు పడ్డ నానా యాతనా, మొరటుగా,

బండగా తన శరీరాన్ని హింసించిన ఎన్నో మగ చేతులు, గోతికాడ నక్కల్లా తన సంపాదన తనకి పూర్తిగా దక్క నివ్వని మామూలు రాయుళ్ళు .... ఆ బాధంతా తప్పింది యీ గుడ్డోడి వల్ల.. 'అయినా వెయ్యి రూపాయలు—వెయ్యి రూపాయలంటే.మాటలేంటి... రాణీలా బతకొచ్చు..చిన్న కొట్టెట్టుకోవచ్చు . వడ్డీకి తిప్పుకోవచ్చు... ఆ బతుకే వేరు' అనుకుంది సావిత్రి ఆ వేరే బతుకు లోని సుఖాలు కళ్ళ ముందు మెది లాయి సావిత్రికి. 'మనసు పుడితే చుక్కేసుకోవచ్చు .... కావల్సింది తినొచ్చు . తనకి నచ్చినోడితో, తన అందాలన్నీ చూసి హుషారుగా పడే వాడితో గడపొచ్చు ... ఎంతేనా యీ గుడ్డాడు తన వయసుకి సరైనోడుకాదు. తన మీద చాలా పనోడు .... ఆడి దగ్గ రున్నంత సేపు ఎంతో లాలించినట్టుం టది తప్ప .... ఎప్పుడో కానీ సుఖపడి నట్టుండదు ..."

మొత్తానికి ఆ సాయంత్రం గుడ్డాడు తిరిగొచ్చేటప్పటికి సావిత్రి మనసులో నిర్ణయాని కొచ్చేసింది. రాత్రి తిండి తినేటప్పుడు ఎంతో లయగా అడి గింది .. "డబ్బెక్కడ దాచావేంటి.." అని ..

"వుంది లే....ఏం " అన్నాడు.

"నువ్వన్నట్టు తొరగా ఏదోటి చేద్దాం. చేతిలో సొమ్ముంటే.." అంది నెమ్మదిగా

"సొమ్మెంత సేపే .... ఏం చేద్దామో చెప్పు రేపీపాటికి తెస్తా సొమ్మ..." అన్నాడు వాడు హుషా రుగా....

"అబ్బో గొప్ప....నువ్వు సొమ్మ తేవాలే కానీ .... నేను చెప్పట మెంత సేపు...." అంది.

"సరే అయితే....రేపే తెచ్చి నీ చేతుల్లో పోస్తా... సరేనా .."అన్నాడు

"సరే...." అంది సావిత్రి

ం ం ం

తెల్లారిం దగ్గర్నించీ కొత్త రెక్క లొచ్చిన పక్షిలా వుంది సావిత్రికి మన సు. 'ఇంక కొద్ది గంటలు... వెయ్యి రూపాయలు....ఆ పిచ్చి గుడ్డాడు తెచ్చి తన చేతిలో పోస్తాడు .... యింకా ఆ తర్వాత తను రాణీ '

వుత్సాహం సావిత్రిని వసారాలో నిలవ నివ్వలేదు. సందు దాటి రోడ్డు మీద కొచ్చింది. రకరకాల ఆడాళ్ళని, రంగు రంగుల చీర్లని, వేగంగా వెళ్లే కార్లని, బస్సుల్ని హుషారుగా చూసిం ది. రకరకాల మనుషులు....రకరకాల మగాళ్ళు....మనసుని మరిపిస్తూ నిము షానికో వూహ... యింక మన సుండ బట్టలేదు సావిత్రికి .. బొడ్డులో డబ్బు లున్నాయి .. నెమ్మదిగా మనసుకి నచ్చ చెప్పుకుంది. "ఒక్క చుక్క అని.." కల్లుపాక వెళ్ళి, కడుపు నిండా పుచ్చు కుంది. వొళ్ళు మనసు వూహల్లో, హుషార్లో తేలుతున్నాయి. ఇంకసావిత్రి లేద్దామనుకుంటుంటే....

"గ్లాసెనక గ్లాసు బలే తాగు తున్నావే...." అన్నాడు సావిత్రి దగ్గ రగా వొచ్చి మల్లయ్య....

"ఏయ్....ఎవరు నువ్వు.. "అంది సావిత్రి మల్లయ్య వేపు మత్తుగా



చూస్తూ ...

"నేనూ నీ లాంటోణ్ణేలే...." అన్నాడు పక్కన కూచుంటూ ... సావిత్రికి ఆ కబురు యీ కబురు చెప్పి మరింత తాగించాడు తాగుడు మత్తుతో పాటు· మల్లయ్య మత్తూ ఎక్కింది సావిత్రికి. వెళ్ళే ముందు ఒక్కత్తే వెళ్ళకుండా కూడా మల్లయ్యనీ తీసి కెళ్ళింది.

○ ○ ○

వో చేతిని సంచీలో పెట్టి డబ్బుని పట్టుకుని నెమ్మదిగా నడుస్తున్నాడు. తృప్తిగా వుంది వాడికి. "తీసికెళ్ళి సావిత్రికి యిచ్చేస్తే ..." అంతే, అంత కన్నా తను చెయ్యాల్సిందేం. కనిపించటం లేదు వాడికి. రాత్రి సావిత్రికి డబ్బు తెచ్చిస్తానని చెప్పిం దగ్గర్నుంచీ వాడికి . క్షణం మనసు నిలవటం లేదు. ఎన్నో ఏళ్ళ నుంచీ దాచుకున్న ఆ డబ్బు సావిత్రికి అందించేస్తే చాలు అనిపించింది వాడికి ..తన గుడ్డి బతుకు, అడుక్కునే జీవితం పూర్తిగా మారిపోతోందన్న భావన వాణ్ణి ఆ రోజు మామూలుగా అడుక్కోనివ్వలేదు. మధ్యాన్నమే బైలుదేరి యింటి దారి పడ్డాడు. ఎండ చురుక్కుమంటున్నా చల్లగానే వున్నట్టుంది వాడికి.

'సందు మలుపు తిరుగుతుంటే గుండెలు ఘల్లుమన్నాయి వాడికి ఆతృత, వుత్సాహం ... మైమరపు అన్నీ కలిశాయి. ఎప్పుడూ తొందరగా నడవని వాడు కొంచం తొందరగా అడుగులేశాడు. వసారా గోడ దాకా అలాగే హుషారుగానే నడిచాడు.

వసారా గోడ దగ్గరికి రాగానే వినపడ్డ ఆ చప్పుడు వాణ్ణి అణువణునా కుంగ దీసింది. అనుమానం వొచ్చి ఒక్క క్షణం కదల కుండా నిలబడి విన్నాడు. అదే ధ్వని, పాము బుసలా, గాలి తుఫాన్లా సావిత్రి ఆయాసం.... అంటే సావిత్రి మరో మగవాడితో....

ఆ క్షణంలో వాడికేం జరుగుతోందో వాడికే తెలియలేదు. గుడ్డి జీవితానికి వెలుగులా అందినట్టు అందిన పెన్నిధి జారిపోయింది. ఆశలు,

వూహలు. వుత్సాహం తప్పితే దు లవ టమే కాక బతుకులో అన్నేళ్ళ నుంచీ వాడికి తెలిసీ, తెలియకుండా వెతు క్కుంటున్న దగ్గర తనం, నమ్మకం, మానవత్వం అన్నీ నాశనమైనట్టుంది.

మరి కాస్సేపు అలాగే నిలబడి కావాలనే కర్రతో గట్టిగా చప్పుడు చేస్తూ వసారా మెట్ల వేపు నడిచాడు. హడావుడిగా లేచిన సావిత్రి మల్లయ్యకి చప్పుడు చెయ్యకుండా వెళ్ళిపొమ్మని సైగ చేసింది. మల్లయ్య ఎంత నెమ్మ దిగా వెళ్ళినా మరో మనిషి అడుగుల చప్పుడు ఆ గుడ్డి చెవులు వినవే విన్నాయి.

ఆ సమయంలో వాడు రావటం ఆశ్చర్యంగా వున్నా, దానికన్నా ఎక్కు వగా మరేదో బాధ కలిగింది సావిత్రికి గుడ్డాడు... జరిగింది వాడికేం తెలుస్తుం దిలే...." అని సరిపెట్టుకోవాలని ప్రయత్నించినా సావిత్రి మనసుకి అసంతృప్తి గానే వుంది.

సాయంత్రందాకా ఇద్దరూ పెద్దగా మాటామంతీ లేకుండానే గడిపారు. రాత్రి యిద్దరూ కలిసి మామూలుగానే తిండితిన్నారు మామూలుగానే పడు కున్నారు.

ముందు కొంచం ఆ కినా, చివరికి మొండిగా సావిత్రేముందు వాడి వొంటి మీద చెయ్యేసింది.

మధ్యాహ్నం ఆ వసారా మెట్లు ఎక్కిన క్షణం నుంచీ ఆలోచిస్తూనే వున్నాడు వాడు ఏంచెయ్యాలా అని? సావిత్రిని దూరం చేసుకోటమా.... చేసు కుని తిరిగి అదే వొంటరి బతుకు.... అదేచీకటిలో కూరుకుపోటము.... వాడికి మనసొప్పలేదు. మరో మనిషితోడు.... బతికే వున్నావు అని మనసుకి తెలియ చెప్పే స్పర్శని దూరం చేసుకోవాలని పించటంలేదు.... ఎంత యిబ్బందైనా ఆశల్ని. బతుకుని పూర్తిగా ఖూనీ చేసు కోటం సాధ్యం కావటంలేదు.

సావిత్రి పాములా మెలికలు తిరు గుతూ వాడి వొంటినంతా తడిమేస్తోంది. ఆమనిషే.... ఆ చేతులే.... ఆ స్పర్శే... అయినా వాడికి వేరుగా వుంది... గోతిలో దాచిన డబ్బుని వెతుక్కుంటున్న నక్కలావుంది సావిత్రి చేతివేళ్ళస్పర్శ.

"అంతే.... అదొక్కటేదారి. సావి త్రికి డబ్బు అందకుండా జాగ్రత్త పడాలి....' అనుకున్నాడు.

అంతగా కదలికలేని వాణ్ని చూస్తూ....గుడ్డాడికి ఏదో అనుమానం తగిలింది....ఎలాగేనా మళ్ళీ దగ్గ రవ్వాలి...." అనుకుంది సావిత్రి.

ఆ రాత్రి.. అంతకుముందు రాత్రుళ్ళల్లాగే గడిచింది. కానీ అను భూతిలేదు....ఆ తృప్తిలేదు... అంతా బాగానే మామూలుగానే జరిగినట్టుంది. కానీ అలా గడిచిన ఆ సమయంలో జీవితం వున్నట్టులేదు. జీవితానికి, మనుషులకి అవసరమైన స్పర్శ వున్నట్ట నిపించలేదు. కళ్లున్న సావిత్రికి, కళ్ళు లేని గుడ్డాడికి యిద్దరికీ అలాగే అని పించింది.

"ఎందుకిలా జరిగింది. తామిద్దరి మధ్యా నిన్నటిదాకా వున్న జీవితం చచ్చిపోయినట్టు ఒక్కరోజులో యిలా అయిపోయిందేమిటి? బతుకుల్ని చంపేసే యింత బలమా డబ్బుకి... వెయ్యి రూపాయలకి...." అను కున్నాడు గుడ్డాడు. ❋